నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 19 సెప్టెంబర్ 2024 | KAMAREDDY

నిమజ్జనంలో అపశృతి

- మానిక్‌బండార్‌లో డీజే సౌండ్‌తో యువకుడికి గుండెపోటు
- ఆర్మూర్‌లో వినాయక విగ్రహం మీద పడి ఒకరికి గాయాలు

ఆర్మూర్‌టౌన్/ మాక్లూర్, సెప్టెంబర్18: వినాయక నిమజ్జనంలో అపశృతి చోటుచేకున్నది. మాక్లూర్ మండలం మానిక్ బండార్‌లో డీజే సౌండ్‌కు గుండెపోటు వచ్చి ఓ యువకుడు మృతి చెందగా.. ఆర్మూర్ మండలం మామిడిపల్లిలో వినాయక విగ్రహం మీదపడి మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మాక్లూర్ మండలంలోని ముత్యంపల్లి గ్రామానికి చెందిన ఊరడి మధు (27) మంగళవారం సాయంత్రం మానిక్‌బండార్‌లో హిందూ సేన యువజన గణేశ్ మండలి వారు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనం కోసం తరలించడానికి తన ట్రాక్టర్ తీసుకొని వచ్చాడు. గణేశ్ నిమజ్జన శోభాయాత్ర రామాలయానికి చేరుకోగా..ఉదయం మూడు గంటల ప్రాంతంలో మధు ఆలయ ఆవరణలో నిద్రించాడు. ఉదయం 8 గంటల సమయంలో గణేశ్ మండలి సభ్యులు అతడిని నిద్రలేపడానికి ప్రయత్నించగా.. అప్పటికే మృతిచెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గుండెపోటుతో మృతిచెందినట్లు ఎస్సై అనుమానం వ్యక్తంచేయగా.. కుటుంబ సభ్యులు మాత్రం డీజే సౌండ్‌తో గుండెపోటు వచ్చి మృతిచెందాడని పేర్కొన్నారు. ఆర్మూర్ మున్సిపల్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన యువసేన యూత్ సభ్యులు వినాయక విగ్రహాన్ని క్రేన్ సాయంతో పైకిలేపుతున్న సమయంలో విగ్రహం జారిపడడంతో అక్కడే ఉన్న మహేశ్ అనే యువకుడిపై పడడంతో చేయి విరిగింది. యూత్ సభ్యులు హుటాహుటిన దవాఖానకు తరలించారు. క్రేన్ సాయంతో విగ్రహాలను నీళ్లలో ఒకేచోట వేయడంతో అవి మునగడంలేదని మండపాల నిర్వాహకులు ఆందోళనకు దిగారు. వైద్య సిబ్బంది అందుబాటులో కూడాలేకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఆర్మూర్ మండలం మామిడిపల్లిలో నిమజ్జనం చేసే సమయంలో ట్రాక్టర్ నుంచి కిందపడుతున్న విగ్రహం

నగరంలో గ్యాంగ్‌వార్

- బ్యాండ్ విషయంలో పరస్పర దాడులు

ఆర్యనగర్ ప్రాంతంలో యువకులను చెదరగొడుతున్న పోలీసులు

వినాయక్‌నగర్, సెప్టెంబర్18: బ్యాండు విషయంలో జరిగిన గొడవ పరస్పర దాడులకు దారితీసిన ఘటన నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని నాల్గోటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. ఆర్యనగర్ ప్రాంతానికి చెందిన చిన్నారులు తమ వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు బ్యాండ్‌తోపాటు డ్యాన్స్ చేసుకుంటూ వెళ్తున్నారు. అదే సమయంలో సురేశ్, సాయికిరణ్ 'మీ బ్యాండ్ మా గణేశ్ ముందు వాయించాలని..' డిమాండ్ చేశారు. ఇందుకు పిల్లలు అంగీకరించకపోవడంతో సురేశ్ వారిపై దాడి చేశాడు. ఈ విషయాన్ని పిల్లల ద్వారా తెలుసుకున్న మాధవ్‌నగర్ ప్రాంతానికి చెందిన మట్టు అనే యువకుడు తన అనుచరులతో కలిసి అక్కడికి చేరుకున్నాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంతో ఫోర్త్ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకొని రెండు గ్యాంగులకు చెందిన సుమారు 50 మందిని చెదరగొట్టారు. ఘటనాస్థలం నుంచి వెళ్లిపోయిన సురేశ్ తన అనుచరులతో కలిసి మాధవనగర్‌లో ఉంటున్న మట్టు వద్దకు చేరుకున్నారు. అక్కడ మట్టు గ్యాంగ్ సభ్యులు దాడులకు దిగడంతో పరస్పరం బీరు బాటిళ్లు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకునేలోపు రెండు గ్యాంగులకు చెందిన వారు పరారయ్యారు. రెండు గ్యాంగులకు చెందిన వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇందూరు బిడ్డకు డీఎస్పీ కొలువు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 18 : నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు డీఎస్పీగా పోస్టింగ్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డీజీపీ జితేందర్ నిఖత్ జరీన్‌కు నియామక పత్రాన్ని బుధవారం అందజేశారు. నిఖత్ జరీన్ ఇటీవల ఇస్తాంబుల్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో గెలిచి చాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే నజరానాతోపాటు హైదరాబాద్‌లో నివాస స్థలాన్ని కేటాయించింది. కేంద్ర ప్రభుత్వం అర్జున అవార్డును ప్రదానం చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రూప్-1 ఉద్యోగంలో నిఖత్ జరీన్‌ను నియమించింది. దీంతో ఆమెకు నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

కాకతీయ కాలువలో ఒకరి గల్లంతు

బాల్కొండ, సెప్టెంబర్ 18 : మెండోరా మండలకేంద్రంలోని కాకతీయ కాలువలో బుధవారం ప్రమాదవశాత్తు పడి అదే గ్రామానికి చెందిన మరెన్న (32) గల్లంతైనట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలిసిన ప్రాజెక్టు అధికారులు కాకతీయ కాలువకు నీటిని నిలిపివేశారు. మరెన్న భార్య రాజమణి ఫిర్యాదు మేరకు ఘటనాస్థలానికి చేరుకొని, గాలింపు చర్యలు చేపట్టామని ఎస్సై నారాయణ తెలిపారు.

కొండచిలువ @ 15 అడుగులు

చేపల కోసం వేసిన వలకు భారీ కొండచిలువ చిక్కింది. మండలంలోని పోల్కంపేటకు చెందిన బొల్లారం సిద్ధయ్య గ్రామ శివారులోని పెద్దవాగులో చేపల కోసం ఏర్పాటు చేసిన వలను బుధవారం బయటికి తీయగా కొండ చిలువ చిక్కినట్లు గుర్తించి భయాందోళనకు గురయ్యాడు. కొండ చిలువ 15 అడుగులు ఉన్నదని, దానిని హతమార్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

-లింగంపేట, సెప్టెంబర్ 18

పోలీసుల తీరును నిరసిస్తూ కామారెడ్డి జిల్లాకేంద్రంలో అర్ధరాత్రి రోడ్డుపై బైఠాయించిన మండపాల నిర్వాహకులు

నిమజ్జనంలో పోలీసుల వైఫల్యం

నిజామాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో మంగళవారం జరిగిన గణేశ్ నిమజ్జనోత్సవంలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకపోయినప్పటికీ అక్కడక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. నిజామాబాద్ జిల్లాలో పోలీసుల వైఫల్యం కారణంగా నిమజ్జన కార్యక్రమం నిర్దేశిత సమయం కన్నా ఎక్కువ జాప్యం ఏర్పడింది. ప్రతి ఏడాది నిర్ణీత సమయంలో నిమజ్జనానికి వినాయకులు బయల్దేరేది. ఈసారి మధ్యాహ్నం మూడు గంటల తర్వాత దుబ్బ ప్రాంతం నుంచి మొదలైన శోభాయాత్ర అర్ధరాత్రి 12గంటల తర్వాత ముగియడం గమనార్హం. ఆయా ఠాణాల పరిధిలో పోలీసులు అప్రమత్తంగా ఉంటూ వినాయకుడి శోభాయాత్రను వేగంగా జరిగేలా చర్యలు తీసుకునేవారు. ఈసారి అలాంటి చొరవ ఎక్కడా కనిపించలేదు. బీజేపీకి చెందిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా జెండా ఊపి వెళ్లిపోయారు. అనంతరం భక్త జనుల మధ్య శోభాయాత్ర నిజామాబాద్ వీధుల గుండా పూలాంగ్ వినాయకుల బావి చెంతకు చేరింది. బుధవారం ఉదయం 9గంటల వరకు పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి, ఏసీపీ ఆఫీస్‌కు కూత వేటు దూరంలో పలు మండపాల్లో వినాయకుల విగ్రహాలు ఎక్కడివక్కడే కనిపించడం గమనార్హం. కొన్నిచోట్ల మండపాల నుంచి విగ్రహాలను బయటికే తీసుకురాలేదు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వినాయక ప్రతిమల ఊరేగింపు, భారీ వాహనాలతో నగరమంతా బుధవారం కూడా కోలాహలంగా కనిపించింది. అడుగడుగునా పోలీసులు ఉన్నప్పటికీ గణేశ్ మండపాల నిర్వాహకులతో స్థానిక పోలీసుల సమన్వయం కొరవడడంతోనే నిమజ్జన ప్రక్రియలో జాప్యం జరిగినట్లుగా తెలుస్తోంది.

పోలీసుల లాఠీచార్జిలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు

మండపాల నిర్వాహకులతో పోలీసుల వాగ్వాదం

సమన్వయ లేమి, కొరవడిన ముందస్తు ప్రణాళిక

శోభాయాత్ర ఘట్టం ఆలస్యం

గంటలకొద్దీ రోడ్లపైనే గణేశుడి వాహనాలు..

కామారెడ్డిలో ఉద్రిక్తతకు దారితీసిన లాఠీచార్జి

మండిపడుతున్న మండపాల నిర్వాహకులు

అర్ధరాత్రి ఆందోళన

కామారెడ్డి, సెప్టెంబర్ 18 : కామారెడ్డి జిల్లా కేంద్రంలో వినాయక నిమజ్జన శోభాయాత్రలో మంగళవారం అర్ధరాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది.వినాయక నిమజ్జనానికి ఆలస్యం అవుతుందని, ముందుకు వెళ్లాలని బలవంతం చేయడంతో గణేశ్ మండలి నిర్వాహకులు రోడ్డుపై కూర్చొని ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేయడంతో ఉద్రిక్తత నెలకొన్నది. విశ్వ హిందూ పరిషత్ నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేశారు. పోలీసులు క్షమాపణ చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. సోమవారం రాత్రి వినాయకుల నిమజ్జనం ప్రారంభమై మంగళవారం సాయంత్రం పూర్తికావాల్సి ఉంది. కానీ సోమవారం రాత్రి శోభాయాత్ర ఆలస్యంగా ప్రారంభం కావడంతో రెండు రోజులపాటు కొనసాగింది.

కామారెడ్డిలో లాఠీచార్జి కలకలం

కామారెడ్డి జిల్లా కేంద్రంలో వినాయకుడి శోభాయాత్రలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకున్నది. మంగళవారం అర్ధరాత్రి పలువురు యువకులపై పోలీసుల లాఠీచార్జి, తోపులాట ఉద్రిక్తతకు తావిచ్చాయి. హిందూ సంఘాల జోక్యం, నాలుగున్నర గంటల పాటు ఆందోళనలతో కామారెడ్డి పట్టణం అట్టుడికింది. గతంలో ఎప్పుడూ జరగని ఘటన కామారెడ్డిలో వెలుగు చూడడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రశాంతంగా జరగాల్సిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో గణేశ్ మండపాల నిర్వాహకులపై దాడి చేయడంపై బజరంగ్ దళ్ వంటి సంఘాలు పోలీసుల వైఖరిని తీవ్రంగా తప్పు బడుతున్నాయి. వాస్తవానికి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కామారెడ్డిలో నిమజ్జన కార్యక్రమం ప్రత్యేకంగా జరుగుతుంటుంది. పదో రోజున వినాయకుడి శోభాయాత్ర మొదలై 11వ రోజు నిమజ్జనం చేస్తారు. ఈ ఘట్టం అంగరంగవైభవంగా కొనసాగుతుంది. ఈ విషయంపై పోలీసులకు అవగాహన ఉన్నప్పటికీ ఈసారి చేతులెత్తేసిన పరిస్థితులు కనిపించాయి. పదో రోజున చాలా చోట్ల కామారెడ్డిలో విగ్రహాలు రోడ్లపైకి ఆలస్యంగా వచ్చాయి. దీంతో నిమజ్జనంపై ప్రభావం పడి మంగళవారం అర్ధరాత్రి వరకూ కొనసాగింది. ఏటా 11వ రోజు సాయంత్రం 4గంటల్లోపే నిమజ్జనం జరిగేది. ఈసారి గంటల కొద్దీ జాప్యం మూలంగా ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నట్లుగా స్పష్టంగా అర్థమవుతున్నది. పోలీసుల వైఫల్యం మూలంగా సామాన్య జనానికి తిప్పలతోపాటు లాఠీ దెబ్బలు తప్పలేదు. పోలీసుల సమన్వయలేమి, ముందస్తు అప్రమత్తత, సరైన ప్రణాళిక లేకపోవడమూ ఇందుకు కారణాలుగా కనిపిస్తున్నాయి. 2017లో ఎస్పీ శ్వేతారెడ్డి ఉన్నప్పుడు మండపాల నిర్వాహకులతో గొడవలు జరిగాయి. ఆ తర్వాత వారితో సమన్వయం చేసుకుంటూ పోవడంతో అలాంటి పరిస్థితి లేకుండా పోయింది. సరిగ్గా ఎనిమిదేండ్లకు కామారెడ్డి గణేశ్ నిమజ్జనంలో మరోసారి లాఠీచార్జి పరిస్థితులు చోటు చేసుకోవడంపై ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

జెండా ఉత్సవాలు సంపూర్ణం

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని జెండా బాలాజీ ఆలయ ఉత్సవాలు బుధవారంతో సంపూర్ణమయ్యాయి. చివరిరోజు కావడంతో భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఉత్తరపూజ అనంతరం వేద మంత్రాలతో సిర్నాపల్లి గడిలో ఉంచి జెండాకు పూజలు చేశారు. అక్కడి నుంచి పూలాంగ్ వరకు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి వాగు పక్కన ఏర్పాటుచేసిన ప్రత్యేక స్థలంలో జెండాను ప్రతిష్ఠించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు.

-సుభాష్‌నగర్, సెప్టెంబర్ 18

జెండాకు మొక్కేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

స్కూల్ బస్సులో పొగలు

- భయాందోళన చెందిన చిన్నారులు
- తప్పిన పెను ప్రమాదం
- కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘటన

కామారెడ్డి, సెప్టెంబర్ 18 : ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సులో నుంచి ఒక్కసారిగా పొగలు రావడంతో అందులో ఉన్న చిన్నారులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బ్రిలియంట్ స్కూల్‌కు చెందిన బస్సు రామారెడ్డి చౌరస్తా వద్దకు రాగానే ఒక్కసారిగా బస్సులో పొగలు వ్యాపించాయి. వెంటనే డ్రైవర్ అప్రమత్తమై బస్సును పక్కన నిలిపివేశాడు. గమనించిన స్థానికులు వెంటనే చిన్నారులను బస్సులో నుంచి సురక్షితంగా కిందికి దింపారు. బస్సులో సుమారు 30 మంది విద్యార్థులు ఉండగా.. ఏడుస్తూ పరుగులు తీశారు. ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యాన్ని ఫోన్ ద్వారా మాట్లాడడానికి ప్రయత్నించగా.. స్పందించలేదు. సాంకేతిక లోపమని, బ్యాటరీలో నీళ్లు లేకపోవడంతో ప్రమాదం సంభవించినట్లు బస్సుడ్రైవర్ తెలిపాడు. ఎలాంటి ప్రమాదం జరగపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఆర్టీవో శ్రీనివాస్‌రెడ్డిని ఫోన్ ద్వారా సంప్రదించగా.. బస్సు ప్రయాణిస్తున్న సమయంలో సెల్ఫ్‌మోటర్ వద్ద ఉన్న వైర్ కాలి పోవడంతో పొగలు వచ్చాయని, బ్యాటరీ పేలలేదని చెప్పారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టామని, త్వరలోనే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

స్కూల్ బస్సులో నుంచి వస్తున్న పొగలు

సంక్షేమ వసతిగృహాల పనితీరు మెరుగుపడాలి

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కంఠేశ్వర్, సెప్టెంబర్ 18: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరు మెరుగుపడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల నిర్వహణపై కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు.గడిచిన మూడేండ్ల నుంచి పదో తరగతి పరీక్షల్లో సాధించిన ఉత్తీర్ణత శాతాన్ని తెలుసుకున్నారు. ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు, మండల ప్రత్యేకాధికారులు హాస్టళ్లను తనిఖీ చేసిన సమయంలో గమనించిన లోటుపాట్లను ప్రస్తావిస్తూ వాటిని చక్కదిద్దుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యాబోధన, సరైన వసతి సదుపాయాలను కల్పించాలన్నారు. ఆకస్మిక తనిఖీ చేపట్టి ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంస్థల ఫెడరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి దొంగల కలకలం!

- ఇంటి యజమాని గొంతుకోసి సొత్తుచోరీ
- పరిస్థితి విషమం.. నిందితుల కోసం గాలింపు
- పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు
- నాగిరెడ్డిపేట మండలం బంజారాతండాలో ఘటన

వివరాలు 9లో...